క్లుప్తంగా

ఉమ్మడి వ్యూహంతో గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి



విశాఖ రేంజ్ డీఐజీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: ప్రాంతీయ భద్రత, శాంతి భద్రతలను పెంపొందించే దిశగా అడుగులు వేస్తూ గంజాయి అక్రమ రవాణాను నివారించే దిశగా విశాఖ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆలోచనతో ఆంధ్రా–ఒడిశా పోలీసు బలగాల మధ్య కీలక సమన్వయంతో ముందడుగు వేసినట్లు ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు డీఐజీ గోపీనాథ్ జెట్టి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ పాల్గొన్నారు.

దేవి పూజల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర దంపతులు

పార్వతీపురంటౌన్: శ్రీ విద్యాసర్వ మంగళ పీఠం ప్రాంగణంలో జరుగుతున్న శరన్నవ రాత్రి ఉత్సవాల్లో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర దంపతులు పాల్గొని అమ్మవారికి విశేష అర్చనలు అభిషేకాలు, హోమం మంగళవారం నిర్వహించారు. గత 18 సంవత్సరాలుగా దసరా నవరాత్రి ఉత్సవాల్లో ఆయన పాల్గొంటూ పూజా కార్యక్రమాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. మాజీ డిప్యూటీ సీఎం దంపతులతో పీఠం వ్యవస్థాపకుడు, నాడీ జ్యోతిష్యులు మురిపాక కాళిదాసు యాజీ ఆధ్వర్యంలో పూజలు చేయించారు.

ఘనంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవం



ఆయుర్వేద దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

సీతానగరం: ఆరోగ్యానికి ఆయుర్వేదం ఆవశ్యకతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ టి. హేమాక్షి తెలిపారు. 10వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని బూర్జ, ఆయుర్వేద వైద్యశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేదం ఆవశ్యకత, అందుబాటులో ఉన్న ఉచిత ఆయుర్వేద వైద్య సేవలపై డాక్టర్ హేమాక్షి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న ఔషధ మొక్కలపై డాక్టర్ హేమాక్షి వివరించారు. కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది శ్రీనివాసరావు, పద్మ, విజయ, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజనులకు వస్త్రాలు, దోమ తెరల పంపిణీ



మాట్లాడుతున్న మహిళా వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ పద్మ

మక్కువ: మండలంలోని దబ్బగడ్డ పంచాయతీ విజయరాంపురం గ్రామంలో మహిళా వెల్ఫేర్ సొసైటీ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, టాటా కంపెనీల ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన గిరిజనులకు మంగళవారం వస్త్రాలు, దోమతెరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ చొక్కా చిన్నబాబు చేతుల మీదుగా 530 మంది గిరిజనులకు వస్త్రాలు, దోమతెరలు అందజేశారు. మహిళా వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ ఎ. పద్మ, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు మంచు శ్రీరామ్, బొబ్బిలి పాస్టర్ కామేశ్వరరావు, టాటా కంపెనీ మండల కోఆర్డినేటర్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరులో అభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం రాత్రి దొంగలు పడ్డారు. హుండీని పగులగొట్టి నగదు దోచుకెళ్లిపోయారు. ఆలయ అభివృద్ధికి వినియోగించాలనే ఉద్దేశంతో ఐదేళ్లుగా హుండీ తెరవలేదు. స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం యథావిధిగా ఆలయాన్ని తెరిచిన పూజారులు హుండీ చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని కమిటీ సభ్యులకు అర్చకుడు మల్లేశ్వరరావు తెలియజేశారు. దీంతో కమిటీ సభ్యులు, ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్సై ఫకృద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ఇదిలా ఉండగా.. పెద్దూరులోని శివాలయంలో హుండీని దొంగిలించేందు దొంగలు ప్రయత్నించినప్పటికీ వీలుకాకపోవడంతో చిందరవందర చేసి వెనుదిరిగారు.

పర్యావరణానికి ప్రాణసంకటం

- కాలువలు, రోడ్ల పక్కన పేరుకుపోతున్న వ్యర్థాలు
- విషతుల్యమవుతున్న భూగర్భ జలాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



వెంకంపేట చెరువులో ఉన్న చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, (ఇన్‌సెట్లో) చినబొండపల్లి చెరువులో స్థానికులు వేసిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు

పార్వతీపురం రూరల్:

దైనందిన జీవితంలో భాగమైపోయిన ప్లాస్టిక్, నేడు పర్యావరణానికి పెనుశాపంగా మారింది. దాని విచ్చలవిడి వినియోగం మానవ మనుగడకే ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. వాడి పడేసే సంస్కృతి పెరిగిపోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడాల్సిన అధికార యంత్రాంగం నిద్రమత్తులో జోగడం, ప్రజల్లో బాధ్యతారాహిత్యం కలిసి మన భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నాయి. పార్వతీపురం పట్టణంలో ఉన్న చెరువుల్లో ఎక్కువ శాతం చెత్తాచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో పవిత్రమైన జలాలు కలుషిత వుతున్నాయి.

ఎక్కడ చూసినా వ్యర్థాల కుప్పలే..

నగరాలు, పట్టణాలు, గ్రామలు, చెరువులు తేడా లేకుండా ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. పార్వతీపురం మండలంలోని బందలుప్పి, కొత్తపట్నం, పుట్టూరు, తదితర గ్రామాల్లో ఊరికి ముందు, చివర ప్రాంతాల్లో చెత్త నిల్వలు రోడ్డు పక్కన కుప్పలు తెప్పాలుగా పెరిగి డంపింగ్ యార్డును తలపిస్తూ దుర్వాసన వెదజల్లుతున్నాయి. అంతేకాకుండా వీధుల్లో మురుగు కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లతో నిండిపోయి వర్షాకాలంలో డ్రైనేజీ వ్యవస్థను స్తంభింపజేస్తున్నాయి. ఫలితంగా ఇటీవల పార్వతీపురం పట్టణ ప్రధాన రహదారి స్వల్ప వర్షానికే చెరువులను తలపిస్తూ, ప్రజారోగ్యానికి పెనుసవాలు విసురుతోంది. రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోతున్న ఈ వ్యర్థాలు పశువుల పాలిట కూడా మృత్యుపాశాలుగా మారుతున్నాయి. వ్యర్థాలు తిన్న పశువులు రోగాల బారిన పడుతున్నాయి.

అధికారుల నిర్లక్ష్యమే శాపం

ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామని ఎప్పటికప్పుడు ప్రకటనలు గుప్పిస్తున్న అధికారులు వాటి అమలులో క్షేత్ర స్థాయిలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం కేవలం కాగితాలకే పరిమితమైంది. ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, రీసైక్లింగ్ ప్రక్రియ అస్తవ్యస్తంగా ఉన్నాయి. ప్రజల్లో అవగాహన కల్పించడంలో, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ నిర్లక్ష్య వైఖరే ప్లాస్టిక్ భూతం నేడు ఇంతగా పెట్రేగిపోవడానికి ప్రధాన కారణంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజలు మేల్కొని ఈ ప్లాస్టిక్ మహమ్మారిపై యుద్ధం ప్రకటించాల్సిన అవసరం ఉంది.

భూగర్భ జలాలకు పెను ముప్పు

ప్లాస్టిక్ వ్యర్థాలు కేవలం పైపైన కనిపించే సమస్య మాత్రమే కాదు, భూమి లోపల కూడా తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నాయి. భూమిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు కాలక్రమేణా చిన్న చిన్న ముక్కలుగా (మైక్రోప్లాస్టిక్స్) విడిపోయి, భూమిలో ఇంకిపోతున్నాయి. ఈ ప్రక్రియలో వెలువడే హానికర రసాయనాలు భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయి. ప్రజలు తాగే నీరు విషతుల్యమై, దీర్ఘకాలంలో కేన్సర్, నాడీ సంబంధిత వ్యాధుల వంటి భయంకర ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మనుగడకే ప్రమాదం



అధికారులతోపాటు స్థానిక ప్రజలు కూడా పర్యావరణ పరిరక్షణకు బాధ్యత వహించాలి. ప్లాస్టిక్ వ్యర్థాలు, రసాయనాలు అనేక విధాలుగా వాడకం ఎక్కువ కావడంతో ఇప్పటికే 2035 నాటికి ప్రతి ఇంటికి కేన్సర్ సోకే ప్రమాదం ఉంటుందని నివేదికలు చెబుతున్నాయి. ప్రధానంగా నీటి వనరులకు వరాలైన చెరువులు బాధ్యతగా కాపాడుకుంటూ పరిరక్షించుకోవాలి. వాటిలో బాధ్యతారహితంగా చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను వేసి పవిత్రమైన ప్రకృతి వరమైన జలాలను అపవిత్రం చేస్తూ కలుషితం చేయకూడదు. ప్రభుత్వం నీటి వనరులను కాపాడుకునేందుకు అవగాహన కార్యక్రమాలతో పాటు సుందరీకరణ పనులు వంటివి చేపట్టాలి. – మరిశర్ల మాలతి కృష్ణమూర్తినాయుడు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు

బెల్టు షాపులపై ప్రత్యేక నిఘా



జైపాస్ రహదారిలోని వైన్ షాపుల్లో స్టాక్‌ను పరిశీలిస్తున్న సీఐ శిరీష

పార్వతీపురం టౌన్: బెల్టు షాపుల నిర్వహణపై ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శిరీష తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె వైన్‌షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెల్టు షాపుల నిర్వహణ చేపట్టరాదని, హెచ్చరికలు జారీ చేశామని తెలిపారు. ప్రభుత్వ వైన్స్ షాపుల నుంచి బెల్టు షాపులకు మద్యం బాటిల్స్ సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవని సంబంధిత యజమానులకు హెచ్చరికలు జారీ చేశామని చెప్పారు. ప్రతి వైన్ షాపులో ఎక్సైజ్ చట్ట ప్రకారం మద్యం అమ్మకాలు జరగాలని, ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. అంతే కాకుండా ఆయా షాపుల్లో స్టాక్ రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని, ఎప్పటికప్పుడు మద్యం నిల్వలపై సమాచారాన్ని అందించాలని, ఆయా షాపుల యజమానులకు తెలియజేశామని తెలిపారు.

శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురం టౌన్: పట్టణంలో గల శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయని, వెంటనే వాటిపై దృష్టి సారించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని రాయగడ రోడ్డు చివర లెప్రసీ కాలనీకి దగ్గరలో గల శ్మశానం, రామాపురం కాలనీ చివరన గల రెండు శ్మశానాలు, రెడ్డి వీధి చివరన గల శ్మశానం, బెలగాం చర్చి వీధి శివారులో గల శ్మశానం, టౌన్ రైల్వే గేట్ పక్కన గల శ్మశానం, వివిధ శ్మశానాల్లో బోర్లు పూర్తిగా పాడైనాయన్నారు. రోడ్లు పూర్తిగా లేవని, ఇప్పటికే పట్టణంలో ప్రభుత్వం కేటాయించి గుర్తింపు పొందిన 16 శ్మశానాల్లో 14 మాత్రమే మిగిలి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిలో కూడా రోడ్లు, శ్మశాన స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని ఆరోపించారు. ఇకనైనా అధికారులు చిత్తశుద్ధితో స్పందించి పట్టణంలో గల శ్మశానవాటికలకు రోడ్లు వేయాలని, బోర్లు తీయాలని, విశ్రాంతి తీసుకునేందుకు షెడ్లు వేయాలని, గేట్లు, ప్రహరీల నిర్మించాలని, శ్మశాన వాటికల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి కృషి చేయాలని అలాగే కబ్జాదారులపై తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.రాజశేఖర్, పి.గాంధీ, పి.వరదరాజు, జె.సత్తిరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి దేవి అవతారంలో పోలమాంబ



పసుపు కొమ్ములతో అమ్మవారికి అలంకరణ

మక్కువ: మండలంలోని శంబర గ్రామంలో కొలువైన ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పోలమాంబ అమ్మవారి దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం గాయత్రీదేవి అవతారంలో భక్తులకు పోలమాంబ అమ్మవారు దర్శనమిచ్చారు. ఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారిని పసుపుకొమ్ములతో అలంకరించగా వేద పండితుడు శ్రీనివాస్ శర్మ చదురుగుడి వద్ద గణపతి పూజ, గాయత్రి హోమం, మంటప పూజ, గరిక హోమం, గణపతికి విశేష హోమం అత్యంత శాస్త్రోక్తంగా జరిపించారు. కార్యక్రమంలో మార్కొండ మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు, భద్రత కాపాడే దిశగా చర్యలు చేపట్టాలి



ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్

పార్వతీపురంటౌన్: కార్మికుల హక్కులు, భద్రత కాపాడే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో అమలులో ఉన్నట్లుగానే ఎనిమిది గంటల పని పద్ధతి కొనసాగించాలని, అదనపు పనులు చేయిస్తే తగినంత ఓవర్ టైమ్ భత్యం చెల్లించాలనే నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, కార్మిక చట్టాల సవరణల పేరుతో కార్మికులకు అన్యాయం జరుగుతోందని, ఇది శ్రామిక వర్గాన్ని దోపిడీ చేయడానికి దారితీస్తుందని తీవ్రంగా విమర్శించారు. 'కార్మికులను యంత్రాల్లా వాడకూడదని వారికి తగిన వేతనాలు, భద్రత, విశ్రాంతి, ఆరోగ్య సదుపాయాలు కల్పించడం యాజమాన్యం బాధ్యత అని హితవు పలికారు. అలాగే కార్మిక విభాగం అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, చట్టాలను ఉల్లంఘిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయనతో పాటు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి దుర్గారావు పాల్గొన్నారు.

పనిగంటల పెంపు తీర్మానాన్ని రద్దు చేయాలి



సాలూరులో నిరసన తెలియజేస్తున్న కార్మికులు

- సీఐటీయూ డిమాండ్

పాచిపెంట: కార్మికులపై పనిభారం పెంచుతూ అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని వెంటనే రద్దు చేయాలని సాలూరు పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వస్తే కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పిన హామీ నేటికీ అమలుచేయలేదన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక వ్యాపారుల కోసం, కార్మికుల శ్రమ దోపిడీ కోసం ప్రస్తుతం ఉన్న పనిగంటలను రాష్ట్ర ప్రభుత్వం పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిందని, కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్ లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ వేదికగా కార్మిక వర్గం గొంతెత్తి పోరాడుతుంటే రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి కార్మికులకు ద్రోహం చేస్తూ పని గంటలు పెంచుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కమిటీ నాయకులు టి.రవి, టి.శంకర్, టి.రాముడు, పోలరాజు వెంకట్రావు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రేగిడి సమీపంలో ఏనుగుల గుంపు



రేగిడి సమీపంలో తివ్వాకొండల్లో ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని తివ్వాకొండల్లో రేగిడి సమీపంలో మంగళవారం ఏనుగుల గుంపు చేరి గిరిజనులకు ఆందోళన కలిగిస్తున్నాయి. కురుపాం మండలం తులసి నుంచి రేగిడి సమీపంలోకి నాలుగు ఏనుగుల గుంపు తరలి వచ్చినట్లు గిరిజనులు వాపోతున్నారు. తాము పండించే పంటలు తినివేస్తున్నాయని గిరిజన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆది కర్మయోగిపై పీఓ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

పార్వతీపురంటౌన్: ఆది కర్మయోగి అభియాన్ కింద సిద్ధం చేసిన విజన్ ప్లాన్ ను ఎంపీడీఓలు పునఃపరిశీలించి ఐటీడీఏకు సమర్పించాలని జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని గిరిమిత్ర సమావేశ మందిరంలో ఆది కర్మయోగి అభియాన్ పై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, జిల్లా మాస్టర్ ట్రైనీలు, బ్లాక్ మాస్టర్ ట్రైనీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పార్వతీపురం, జీఎల్ పురం, జియ్యమ్మవలస, కురుపాం, కొమరాడ, సాలూరు, పాచిపెంట, మక్కువ, సీతంపేట, పాలకొండ, భామిని, వీరఘట్టం తదితర 12 మండలాల్లోని 165 గ్రామాల్లో ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం అమలు కానుందని తెలిపారు. ఈ 165 గ్రామాల్లో గల 949 హేబిటేషన్లను కవర్ చేస్తూ గ్రామ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇదివరకే ఆదేశించినట్లు చెప్పారు. అందులో భాగంగా ఈ నెల 6 నుంచి ఇప్పటి వరకు నిర్దేశించిన షెడ్యూల్ మేరకు ప్రతి హ్యాబిటేషన్‌ను కవర్ చేస్తూ గ్రామసభలు నిర్వహించిన సంగతిని గుర్తుచేశారు. 5 గ్రామాలు మినహా మిగిలిన 160 గ్రామాల్లో గ్రామ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం అయిందని, బుధవారం వరకు సమయం ఉన్నందున ఆ గ్రామాలకు చెందిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామాల్లో గుర్తించిన ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ప్రాధాన్యతా అంశాలను తమ దృష్టికి తీసుకు రావాలని, రానున్న మూడు రోజుల్లో వాటి వివరాలను సిద్ధం చేయాలని చెప్పారు. ఇప్పటివరకు సిద్ధం చేసిన గ్రామ కార్యాచరణ ప్రణాళికను సమర్పించడంతో పాటు ఆది కర్మయోగి వెబ్ సైట్‌లో నమోదు చేయడం పట్ల అవగాహన ఉండాలని సూచించారు. సమావేశంలో ఐటీడీఏ ఏపీఓ ఎ.మురళీధర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, జిల్లా మాస్టర్ ట్రైనీలు, బ్లాక్ మాస్టర్ ట్రైనీలు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించాలి

పార్వతీపురం రూరల్: స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ వైద్యశిబిరాల ద్వారా ప్రలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అవగాహన కల్పించాలని జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్ రావు సూచించారు, ఈ మేరకు ఆయన మంగళవారం పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన వైద్యశిబిరాన్ని పరిశీలించి స్థానిక వైద్యులకు, సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశిబిరం ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీస్తూ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ముఖ్యంగా ప్రత్యేక వైద్యశిబిరాల ద్వారా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు దీర్ఘకాలిక వ్యాధులు కిశోరీ బాలికలు, మహిళల్లో రక్తహీనతను గుర్తించే పరీక్షలతో పాటు పలు ప్రధాన వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే వ్యాధి నిరోధక టీకాలు కూడా అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డా. జి.ధరణి, డా.పీఎల్ గోపాలకృష్ణ, ప్రత్యేక వైద్యులు డా.కామేశ్వరి, డా.భరత్ చంద్ర, డా.రమ్య, ఆయుష్ వైద్యురాలు డా.సుశీల, డెమో సన్యాసిరావు, సూపర్‌వైజర్‌లు వెంకటనాయుడు, జయలక్ష్మి, శంకర్, వైద్యసిబ్బంది, స్థానిక అంగన్వాడీ సిబ్బది తదితరులు పాల్గొన్నారు.

గాయత్రిదేవి అవతారంలో అమ్మవారు



గాయత్రిదేవి అవతారంలో అజ్జాడలో విజయదుర్గా భవానీ ఆలయంలో పూజలు అందుకుంటున్న అమ్మవారు



పార్వతీపురం టౌన్: గాయత్రి దేవి అవతారంలో కొత్తవలస దుర్గమ్మ



పార్వతీపురం రూరల్: శరన్నవ రాత్రుల్లో రెండోరోజున కొత్తపట్నంలో గాయత్రి దేవిగా పూజలు అందుకుంటున్న కోటదుర్గమ్మ



కోరె గ్రామంలో పూజలందుకుంటున్న కోటదుర్గమ్మ



భక్తులు అందించిన మకరతోరణం



పార్వతీపురం టౌన్: బెలగాం రైల్వే గేటు సమీపంలో పూజలందుకుంటున్న నవదుర్గలు

బలిజిపేట: మండలంలోని అజ్జాడలో శ్రీ విజయ దుర్గా భవాని ఆలయంలో అమ్మవారిని మంగళవారం గాయత్రిదేవి అవతారంలో అలంకరించి పూజలు చేశారు. అర్చకుడు బి.రామలింగస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయానికి విశాఖకు చెందిన కందిన సాయికృష్ణ, స్వప్న దంపతులు మకరతోరణం చేయించి ఆలయ కమిటీకి అర్చకుల సమక్షంలో అందించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతులు సతమతం



మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. కృష్ణమూర్తి

సీతానగరం: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించక పోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించు కోవడంలేదని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని అంటిపేటలో రైతు సంఘం మండల కమిటీ సమావేశం రెడ్డి లక్ష్మునాయుడు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది.

ఈ సమావేశంలో కృష్ణమూర్తి మాట్లాడుతూ దేశంలో ప్రజలందరికీ తిండి పెట్టే రైతు ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే అమ్మబోతే అడివి కొనబోతే కొరివిలా రైతు పరిస్థితి తయారైందని గిట్టుబాటు ధర లేక, ప్రభుత్వ సహాయం లేక అనేక ఇబ్బందులు గురవుతున్నారన్నారు. రాష్ట్ర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధరను ప్రకటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, రైతులకు నష్టం కలిగించే మూడు నల్ల చట్టాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తేవడం దురదృష్టకరమన్నారు. అనంతరం 11మందితో నూతన మండల కమిటీ ఏర్పాటు జరిగింది. అధ్యక్షుడిగా చిట్టి సూర్యనారాయణ, సిరికి శ్రీనివాసరావు కార్యదర్శిగా మండల కమిటీ సభ్యులు రెడ్డి రాము, బల్ల నారాయణస్వామి, బొన్నాడ కృష్ణమూర్తి, రెడ్డి సత్యనారాయణ, పైల విశ్వనాథం, లంక గోపాలం, బంకురు నూకం నాయుడు, బోను స్వామి నాయుడు, గుల్ల తిరుపతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.